సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024


ఫ్యాన్‌ను ప్రదర్శిస్తూ.. అభిమానులను ఉత్తేజపరుస్తున్న జననేత జగన్


జగనన్న క్షేమాన్ని కాంక్షిస్తూ..



కందుకూరులో జగనన్న నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని

జన సునామీ

కందుకూరులో సీఎం జగన్ సభకు పోటెత్తిన ప్రజలు

- జనసంద్రమైన ఏరియా హాస్పిటల్ కూడలి, పామూరు రోడ్డు
- సభ విజయవంతంతో మరోసారి నిరూపితమైన వైఎస్సార్‌సీపీ బలం
- భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి
- మహీధర్‌రెడ్డికి ఎమ్మెల్సీ పదవిస్తామని హామీ

కందుకూరు / సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వైఎస్సార్‌సీపీ అధినేతగా పాదయాత్రగా వచ్చినా.. సీఎం హోదాలో బస్సుయాత్ర చేపట్టినా.. ఎన్నికల ప్రచార సభ నిర్వహించినా.. ఇలా కార్యక్రమమేదైనా సరే జగన్‌మోహన్‌రెడ్డి అడుగుపెట్టారంటే కందుకూరులో జన సునామీ ఆవిష్కృతం కావాల్సిందే. ఎన్నికల ప్రచారంలో భాగంగా కందుకూరులో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం నిర్వహించిన బహిరంగ సభే దీనికి నిదర్శనం. ఉరకలేసే ఉత్సాహం.. ఇసుకేస్తే రాలనంత జనం ఒక్కసారిగా పోటెత్తడంతో బహిరంగ సభ ప్రదేశం కిక్కిరిసిపోయింది. ఎన్నికలు త్వరలో జరగనున్న క్రమంలో సీఎం నిర్వహించిన ప్రచార సభకు ఊహించనంత మంది జనం రావడం.. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో నినాదాలు, చప్పట్లతో పెద్ద ఎత్తున తమ స్పందనను తెలియజేశారు. సభను చూసిన రాజకీయ విశ్లేషకులు, సీనియర్ నేతలు కందుకూరులో వైఎస్సార్‌సీపీదే మరోసారి విజయమని ధీమా వ్యక్తం చేయడం గమనార్హం. కందుకూరులో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.

ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా..

తాడిపత్రి, వెంకటగిరి అనంతరం కందుకూరులో నిర్వహించిన బహిరంగ సభకు సీఎం హాజరయ్యారు. ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సర్కిల్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభ ప్రదేశానికి సాయంత్రం 4.20కు చేరుకున్నారు. దాదాపు రెండు గంటల నుంచే ప్రజలు పెద్ద ఎత్తున ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా తమ అభిమాన నేతను చూసేందుకు ప్రజలు ఉత్సాహం చూపారు. ఏరియా హాస్పిటల్ సర్కిల్ నుంచి పామూరు రోడ్డు చివరి వరకు ఎటు చూసినా భారీ జనసందోహమే కనిపించింది. కందుకూరు పురవీధులన్నీ జనాలతో కిక్కిరిసిపోయాయి. దాదాపు 30 వేల నుంచి 35 వేల మంది ప్రజలు వచ్చి ఉంటారని అంచనా. కందుకూరు సిద్ధమా అని సీఎం అనగానే పెద్ద ఎత్తున ఈలలు, కేకలతో సిద్ధమేనని జనాలు హోరెత్తించారు. దాదాపు 45 నిమిషాల పాటు సీఎం ప్రసంగం సాగింది. సభ పూర్తయ్యేంత వరకు అందరూ ఆయన ప్రసంగాన్ని ఆలకించారు.

ఆప్యాయ పలకరింపు

ఏఎంసీలోని హెలిప్యాడ్ నుంచి నేరుగా ఏరియా హాస్పిటల్ సర్కిల్లోని బహిరంగ సభ ప్రదేశానికి సీఎం చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఉన్న పార్టీ పట్టణాధ్యక్షుడు రఫీ, జేసీఎస్ కన్వీనర్ ముప్పవరపు కిశోర్, వలేటివారిపాళెం ఎంపీపీ మౌనిక, ఇంటూరి హరిబాబు, మురారిశెట్టి శ్రీకాంత్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జాజుల కోటేశ్వరరావును సీఎం ఆప్యాయంగా పలకరించారు. కందుకూరులో ముస్లింల కోసం షాదీఖానాను నిర్మించాలని రఫీ వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం దీనిపై పరిశీలించి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

మీలో ఒకడు.. మధు

కందుకూరు అసెంబ్లీ, నెల్లూరు లోక్‌సభ అభ్యర్థులను ఆదరించాలంటూ వారిని ప్రజలకు సీఎం పరిచయం చేశారు. కందుకూరు నుంచి పోటీ చేస్తున్న బుర్రా మధుసూదన్‌యాదవ్ అత్యంత సౌమ్యుడు, మంచివాడని.. మీలో ఒకరంటూ పరిచయం చేశారు. తనకు అత్యంత ఆప్తుడైన విజయసాయిరెడ్డి నెల్లూరు లోక్‌సభ నుంచి పోటీ చేస్తున్నారని, వీరిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

మహీధర్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటా..

ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డిని సీఎం ప్రత్యేకంగా పరిచయం చేశారు. కందుకూరు టికెట్‌ను బీసీలకు కేటాయిస్తున్నానని చెప్పిన వెంటనే ఒక్క మాట మాట్లాడకుండా.. వెనకడుగేయకుండా అంగీకరించారని చెప్పారు. మీరడిగారు నేను చేసి పెడతానని చెప్పారన్నారు. ఇలాంటి మంచి మనస్సున్న మహీధర్‌రెడ్డి అన్నను గుండెల్లో పెట్టి చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ పదవిని ఇచ్చి చట్టసభల్లో కూర్చునేలా చేస్తానంటూ అందరి సాక్షిగా హామీ ఇచ్చారు. దీంతో ప్రజలు పెద్ద ఎత్తున ఈలలు, నినాదాలతో హోరెత్తించారు. ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వెల్లువెత్తిన అభిమానం: జగనన్న చిత్రపటంతో సందడి


జగన్ మామ.. నేనొస్తున్నా..

రాజ్యాధికారంలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యం


మాట్లాడుతున్న బుర్రా

కందుకూరు: బడుగు, బలహీన వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములు చేయడమే జగనన్న ఆలోచన అని వైఎస్సార్‌సీపీ కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పేర్కొన్నారు. కందుకూరులో ఆదివారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఓడిపోయే చోట బీసీలకు సీట్లను చంద్రబాబు ఇస్తే.. గెలిచే చోటే టికెట్లను మనస్సున్న మారాజు జగనన్న కేటాయించారని తెలిపారు. రామాయపట్నం పోర్టును ఐదు నెలల్లో ప్రారంభించనున్నామని, 70 శాతం ఉద్యోగాలు స్థానికులకే వచ్చేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కందుకూరులో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని వెల్లడించారు. సోమశిల నుంచి రాళ్లపాడు ప్రాజెక్ట్‌కు రావాల్సిన నీటిని తీసుకొచ్చి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు అందించేలా చూస్తామన్నారు. జిల్లాల పునర్విభజన జరిగే పరిస్థితుల్లో కందుకూరును ప్రకాశంలో కలిపే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ న్యాయ సలహాదారుడు జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడారు. అబద్ధాలు చెప్పే అలవాటు లేని జగన్‌మోహన్‌రెడ్డికి.. అబద్ధాలు చెప్పడంలో దిట్టయిన చంద్రబాబుకు మధ్య ఈ ఎన్నికల పోరు జరుగుతోందని చెప్పారు. ప్రజల ఆత్మగౌరవానికి ఈ ఎన్నికలు నిదర్శనమని, ఈ నేపథ్యంలో అన్ని విషయాలను గమనించి తమ తీర్పు చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



కలిగిరి: కలిగిరి మాజీ ఎంపీపీ మెట్టుకూరు వెంకటరామిరెడ్డి, ఆయన కుమారుడు రాంజీవిరెడ్డి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. పార్టీ నెల్లూరు లోక్‌సభ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావుతో కలిసి సీఎంను వారు కలిశారు. పార్టీ కండువాలు కప్పి వీరిని సీఎం సాదరంగా ఆహ్వానించారు.


అదిగో మీ మామయ్య..


సీఎంతో ఎమ్మెల్సీ తూమాటి


బస్సు నుంచి ప్రజలకు నమస్కరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి


కోలాహలం: కేరింతలు కొడుతున్న స్థానికులు


సంక్షేమ సారథిని చూసిన ఆనందంతో మహిళల సందడి




ఆప్యాయంగా: నెల్లూరు లోక్‌సభ, కందుకూరు అభ్యర్థులు విజయసాయిరెడ్డి, మధుసూదన్‌యాదవ్‌ను పలకరిస్తూ..


సీఎంను సత్కరిస్తున్న మానుగుంట


స్వాగతం పలుకుతున్న చంద్రశేఖర్‌రెడ్డి


మహిళతో మాట్లాడుతున్న మణిమంజరి


ఓటు వేయాలని కోరుతున్న సాకేత్‌రెడ్డి, మహిమారెడ్డి


వృద్ధుడికి కరపత్రం అందజేసిన నేహారెడ్డి


వృద్ధులతో మాట్లాడుతున్న నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి

పలకరించి.. మద్దతు కోరి..

అవ్వా బాగున్నావా.. తాతా ఆరోగ్యం ఎలా ఉంది?, అన్నా ఎండలకు జాగ్రత్తగా ఉండండి.. అక్కా పిల్లలెలా ఉన్నారు? ఎన్నికలు సమీపిస్తున్న వేళ అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు ప్రజలను ఇలా పలకరిస్తూ.. మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన తల్లి మణిమంజరి ఆదివారం మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేశారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమారుడు సాకేత్‌రెడ్డి, కోడలు మహిమారెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన సతీమణి సునందారెడ్డి, కుమార్తె నేహారెడ్డి నగరంలోని 9వ డివిజన్‌లో ప్రచారం చేశారు. కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు, ఆ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు రజత్‌కుమార్‌రెడ్డి ఇందుకూరుపేట మండలంలో ప్రచారం నిర్వహించారు.

– ఆత్మకూరు/కావలి/నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)/ఇందుకూరుపేట

ప్రచార పర్వం

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదెల మృతి



కొండాపురం: మేత కోసం వెళ్లిన రెండు గేదెలు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన ఘటన మండలంలోని చింతలదేవి గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బొచ్చు బ్రహ్మయ్య, కడియంపాటి సుగణమ్మకు చెందిన గేదెలు మేత కోసం వెళ్లాయి. ఉప్పుటేరు వాగు వద్దకు వెళ్లాయి. ఈ సమయంలో ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై అవి మృతిచెందాయి. వాటి విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తమ గేదెలు మృతిచెందాయని వాపోయారు.

ట్రాక్టర్ దగ్ధం


కాలిపోతున్న ట్రాక్టర్

సోమశిల: గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ వైర్లు తగిలి దగ్ధమైన ఘటన అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్ల గ్రామ శివారులో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గడ్డిలోడుతో ట్రాక్టర్‌కు వెంగంపల్లి నుంచి మర్రిపాడు వైపు వెళ్తుండగా విద్యుత వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ మాల్యాద్రి గడ్డిని కిందకు దించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కాలుతున్న గడ్డి అతడిపై పడి గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది మాల్యాద్రిని ఆస్పత్రికి తరలించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 143
లేయర్ (లైవ్)	: 93
బ్రాయిలర్ చికెన్	: 254
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 284
లేయర్ చికెన్	: 158

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.90
పండ్లు	: రూ.80

200 మంది టీడీపీ, జనసేన కార్యకర్తల చేరిక


పార్టీలో చేరిన వారితో విజయసాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఖలీల్ అహ్మద్

నెల్లూరు(దర్గామిట్ట): 50, 51వ డివిజన్ల నుంచి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 200 మంది కార్యకర్తలు ఆదివారం 51వ డివిజన్ ఇన్‌చార్జి కాయల సురేష్, జిల్లా పార్టీ కార్యదర్శి సీహెచ్ కిషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నగరంలోని రామ్మూర్తి నగర్‌లో ఉన్న క్యాంప్ కార్యాలయంలో వారికి ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పెద్ద ఎత్తున యువత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం పనిచేయాలని సూచించారు.

జగన్ పాలనపై దుష్ప్రచారం

• ప్రొఫెసర్ రవిశంకర్ చందు



నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనపై కొందరు ప్రవాసాంధ్రులు దుష్ప్రచారం చేస్తున్నారని ప్రొఫెసర్ రవిశంకర్ చందు అన్నారు. నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు ఎన్‌ఆర్‌ఐలు చంద్రబాబును గెలిపించాలని స్వార్థపూరిత ఆలోచనలతో విద్యారంగంపై అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు. వారు గత ప్రభుత్వంలో విద్యావ్యవస్థ ఎలా ఉండేదో తెలుసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు – నేడు ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేశారన్నారు. మధ్యాహ్న భోజన మెనూలో మార్పులు తెచ్చి పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. పాఠశాలలు పునఃప్రారంభించిన రోజే విద్యాసామగ్రి ఇచ్చారన్నారు. ఆంధ్రప్రదేశ్‌పై ప్రేమ ఉంటే రెండు సంవత్సరాల ముందు వచ్చి సూచనలు ఇచ్చి ఉంటే బాగుండేదన్నారు.

మోసం చేయడం చంద్రబాబు నైజం


వరకవిపూడిలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు: ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నాయుడి నైజమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వరకవిపూడి, మల్లికార్జునపురం పంచాయతీల్లో ఆదివారం సాయంత్రం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చాక బాబు ఏ విధంగా మోసం చేశాడో ప్రజలందరూ చూశారన్నారు. ఈసారి గెలవడానికి అనేక హామీలు ఇస్తున్నాడన్నారు. వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యం లేక జనసేన, బీజేపీతో పొత్తు పెట్టుకున్నాడని, వారిని నమ్మితే నట్టేట ముని గినట్లేనన్నారు. 2019లో అధికారంలో వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు పెట్టుబడి సాయం చేశారన్నారు. మహిళల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యంగా దేశంలో ఎక్కడా లేని విధంగా సామాజిక పింఛన్ రూ.3 వేలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. హామీలను 99 శాతం మేర నెరవేర్చామన్నారు. రాజకీయాలకతీతంగా చెప్పిన దానికన్నా మిన్నగా ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించిన ప్రభుత్వాన్ని ఆదరించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని మంత్రి కాకాణి కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, ఎంపీపీ ఉప్పల స్వర్ణలత, జిల్లా కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, నాయకులు కూరపాటి కృష్ణారెడ్డి, బల్లి చంద్రశేఖర్, ఎల్లసిరి సుబ్బరాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

• వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, చిత్రంలో పార్టీ నాయకులు

ఉదయగిరి: 'సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా ఉంది. ఆయన మాటపై నిలబడే వ్యక్తి. మరోసారి సీఎంగా అవకాశం ఇవ్వాలి' అని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టో అన్ని వర్గాలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందులో పొందుపరిచారన్నారు. దీనిపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పథకాన్ని రెట్టింపు చేశారని, తద్వారా పేదలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. జగనన్నపై ప్రజల్లో పూర్తి నమ్మకం ఉందన్నారు. ప్రజల్ని మోసం చేసేందుకు త్వరలో చంద్రబాబు మేనిఫెస్టో విడుదల చేస్తారని, అది చెత్తబుట్టకే పరిమితమవుతుందన్నారు. బాబు మాటల్ని ప్రజలు నమ్మే స్థితి లేదన్నారు. 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి, నాయకులు మూలె వినయ్‌రెడ్డి, అక్కి భాస్కరరెడ్డి, మూలె సుబ్బారెడ్డి, డి.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు చేసేలా మేనిఫెస్టో

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి


చేనేత కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం ఆయన మండల కేంద్రమైన సంగంలో పర్యటించారు. బస్టాండ్ సెంటర్ నుంచి దళితవాడ, కొత్తూరు తదితర ప్రాంతాల్లో తిరిగి ప్రజలను పలకరించారు. స్థానికంగా చేపట్టిన పనులు, ఇంకా చేయాల్సిన వాటి గురించి వారితో చర్చించారు. త్రివేణి సంగమం ఒడ్డున సంగమేశ్వరస్వామి ఆలయం, ఎంజీఆర్ సంగం బ్యారేజ్ తదితర ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేశామని ఎమ్మెల్యే వివరించారు. బ్యారేజ్ వద్ద ఘాట్, కనెక్టింగ్ రోడ్డు తదితర నిర్మాణాలు చేపట్టడం ద్వారా అటు నెల్లూరుకు, ఇటు ఆత్మకూరుకు మధ్యలో ఉన్న సంగం అభివృద్ధి చెందుతుందని వివరించారు. త్వరలోనే ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా పట్టణ కేంద్రంలో బస్టాండ్ నిర్మాణం సైతం పూర్తి చేయనున్నామన్నారు. కొత్తూరు సమీపంలోని అంగట్లో టిఫిన్ చేసిన ఎమ్మెల్యే దుకాణదారురాలితో మాట్లాడారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ఆరాతీశారు. చేనేత మగ్గాలు నేస్తున్న నేతన్నల వద్దకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గతంలో కంటే అధికంగా ఈసారి సంక్షేమాన్ని అందిస్తారని, మీ కుటుంబాలు ఆనందంగా ఉంటాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, సూరి మదన్‌మోహన్ రెడ్డి, నేతలు గుండాల బాలచంద్రారెడ్డి, బాలనాయుడు, ప్రసాద్‌రెడ్డి, ఫణి తదితరులున్నారు.

తెలుగుదేశం పార్టీని నమ్మొద్దు


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో మేయర్ స్రవంతి, కోటారెడ్డి

• వైఎస్సార్‌సీపీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: 'అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ ప్రజలకు మంచి చేయలేదు. వారిని నమ్మొద్దు' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గంలోని 41వ డివిజన్‌లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 41వ డివిజన్ కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి, ఇన్‌చార్జి బాబ్జీ యాదవ్ తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆదాల మాట్లాడుతూ చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన మాటను ఏనాడు నిలబెట్టుకోలేదన్నారు. హామీలను నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ డివిజన్ పరిధిలో రూ.కోట్లతో అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ స్రవంతి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, సుధీర్‌కుమార్ రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, స్వర్ణా వెంకయ్య, బెల్లంకొండ వెంకయ్య, ఆనంద్, అద్దంకి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడండి.. ఆశీర్వదించండి

• నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఐదేళ్ల కాలంలో నగరంలో జరిగిన అభివృద్ధిని చూసి తనను ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ కోరారు. 9వ డివిజన్ నజీర్‌తోట తదితర ప్రాంతాలు, అలాగే 13వ డివిజన్ మిట్టపాళెం, బలిజపాళెంలో ఆయన ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి ఇప్పటికే ప్రకటించారన్నారు. సామాన్యుడినైన తనకు సీఎం జగనన్న అవకాశం కల్పించారన్నారు. ఎటువంటి వ్యాపారాలు లేవని, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ముఖ్యమంత్రి విడుదల చేసిన మేనిఫెస్టోపై అన్ని వర్గాల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, 9వ డివిజన్ ఇన్‌చార్జి వంగాల శ్రీనివాసులురెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం చేస్తున్న ఖలీల్ అహ్మద్, నాయకులు